# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 30 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బంగాళాఖాతంలో వాయుగుండం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారిందని వాతావరణశాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. బాలాసోర్‌కు 180కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన వాయుగుండం.. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌ల మధ్య తీరం దాటనున్నదని తెలిపింది. ఈ వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. దీంతో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లను జారీచేసినట్టు తెలిపింది. ఈ వాయుగుండం తుపానుగా మారే అవకాశం కూడా ఉన్నదని హెచ్చరించింది. గురువారం 11:30గంటలకు సాగర్ ద్వీపం–ఖేపుపారా మధ్య పశ్చిమబెంగాల్–బంగ్లాదేశ్ తీరాలను దాటిందని వెల్లడించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించడంతో పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నది.

## ఉత్తమ చిత్రంగా కల్కి



- ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్
- ఉత్తమ రెండో చిత్రంగా పొట్టేల్
- ఉత్తమ మూడో చిత్రంగా లక్కీ భాస్కర్
- గద్దర్ అవార్డులను ప్రకటించిన జ్యూరీ చైర్ పర్సన్ జయసుధ
- మొత్తం 11 కేటగిరీల్లో 21 మందికి అవార్డులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కవి గద్దర్ పేరుతో తెలంగాణ సినిమా అవార్డుల వివరాలను ఎఫ్‌డీసీ చైర్మెన్ దిల్‌రాజుతో కలిసి అవార్డుల జ్యూరీ చైర్ పర్సన్ జయసుధ గురువారం ప్రకటించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ దాదాపు 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవార్డులను ఇవ్వబోతోందని అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా అవార్డులను ఎంపిక చేశామని జయసుధ చెప్పారు. అవార్డులు తమకు బూస్ట్ ఇస్తాయని.. ప్రభుత్వం తమకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భట్టి విక్రమార్క , కోమటిరెడ్డి , దిల్ రాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. 14 ఏళ్ల అనంతరం అవార్డులు ఇవ్వటం సంతోషమన్నారు. బెస్ట్ ఆఫ్ బెస్ట్ కే అవార్డులు వస్తున్నాయని అన్నారు. జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. అలాగే 2014–23 సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామన్న జయసుధ వెల్లడించారు.

మొత్తం 11 కేటగిరీల్లో 21 మందికి అవార్డులు వరించాయి. ఎవరెవరికి మిగితా 2వ పేజీలో

## నూతన గనుల కోసం కృషి చేయాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,
- కోలిండియా, సింగరేణి పై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై నేడు కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ సిఎండి ఎన్. బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బలరాం సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు.

ఈ సందర్భంగా .కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు మరియు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యానారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ శ్రీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలు
## అనర్హులకు అందిస్తే అధికారులపై చర్యలు



- భారతదేశ చరిత్రలోనే వరి సాగులో తెలంగాణ నంబర్ వన్..
- అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం..
- వానాకాలం ముందస్తు సాగు రైతులను సన్నద్ధం చేయాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

బలగం టీవి, రాజన్న సిరిసిల్ల:

యాసంగి సీజన్ లో తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని, స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున ధాన్యం సాగు జరగలేదన్నారు. దేశంలో వరి పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వానాకాలం పంటల సాగు సన్నద్ధతపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం సుందిళ్ల అన్నారం మేడిగడ్డ బ్యారేజీ లో నుంచి చుక్క నీరు రాకున్నా అధికారుల సహకారం ప్రభుత్వం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్ల అత్యధికంగా వరి సాగైందని పేర్కొన్నారు.ఖరీఫ్ సీజన్ లో ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రణాళికలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపి లను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం సిల్ట్ కారణంగా తగ్గిందని, రాష్ట్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం ఎస్సారెస్పీ రిజర్వాయర్ పూడికతీత, డీ సిల్టేషన్ ఆధునిక పద్ధతుల్లో పూర్తి చేసి పూర్వపు సామర్థ్యం తీసుకొని వస్తామని అన్నారు. అదేవిధంగా కడెం ప్రాజెక్టు తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో సిల్ట్ తొలగించేందుకు అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తామని,ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాలువలు, తూములు, ఓటి మరమ్మత్తు పనులు ఓ అండ్ పి క్రింద పూర్తి చేయాలని అన్నారు. మిగితా 3వ పేజీలో




# భారత సార్వభౌమాధికారాన్ని తాకట్టా..?

- ట్రంప్‌నకు తాకట్టు పెట్టడమేంటి
- యుద్ధాన్ని అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారు
- యుద్ధ విరమణతో సైనికుల ఆత్మస్థైర్యం, ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు
- మోదీకి వీరతిలకం దిద్దితే యుద్ధంలో వెనుకడుగు వేశారు
- పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి
- నాడు ఇందిర పాకిస్తాన్ ను చీల్చి బంగ్లాదేశ్ ఏర్పాటు చేశారు.
- నేడు మోదీ పాకిస్తాన్ ను మరో సారి చీల్చి బలూచిస్తాన్ ను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు!?
- ఇందిర చూపిన ధైర్యం మోదీకి ఆదర్శం కావాలి
- మోదీ తిరంగా పేరుతో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు.
- ఇందిరను ఆదర్శంగా తీసుకుని చైనా, పాకిస్తాన్ కు బుద్ధి చెప్పాలి.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జైహింద్ యాత్ర, బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పాకిస్తాన్‌తో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్నది సీజ్ ఫైర్ కాదని.. అది భారత సార్వభౌమాధికారాన్ని ట్రంప్‌నకు తాకట్టు పెట్టడమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలోని విజ్ఞాన్ జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ ఫంక్షన్ హాల్ వరకు గురువారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైహింద్ ర్యాలీలో సీఎం పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాలను చేతపట్టి ముందుకు సాగారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో ప్రధాని మోదీ పాకిస్తాన్‌తో యుద్ధం విరమించారని ధ్వజమెత్తారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని, దేశ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారు? పాకిస్తాన్‌తో యుద్ధంలో రఫేల్ విమానాలు ఎన్ని నేలకూలాయో లెక్క చెప్పాలి' అని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ హయాంలోని యుద్ధ విమానాలే పాకిస్తాన్‌తో యుద్ధంలో దేశ ఆత్మ గౌరవాన్ని కాపాడాయని, మోదీ కొనుగోలు చేసిన రఫేల్ విమానాలు మాత్రం యుద్ధంలో నేలకూలాయని ఎద్దేవా చేశారు. యుద్ధం చేయాలనుకున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. యుద్ధంపై ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు మోదీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అఖిలపక్ష సమావేశంలో దేశంలోని అన్ని ప్రధాన పార్టీలు కేంద్రానికి బాసటగా నిలిచాయని గుర్తు చేశారు. అయితే భారత్, పాకిస్తాన్‌ల సీజ్ ఫైర్ విషయమై అమెరికా అధ్యక్షులు ప్రకటన చేయడం దేశానికి అవమానకరమన్నారు.అమెరికా ఒత్తిళ్లకు తలవంచి సీజ్ ఫైర్‌కు అంగీకరించడం దారుణం అన్నారు.

పాకిస్తాన్‌తో యుద్ధంలో అపరకాళీ ఇందిరా గాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకుంటే బాగుండేదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు యుద్ధం ఆపాలని ఇందిరా గాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారని, కానీ ఆమె అమెరికా బెదిరింపులకు లొంగలేదన్నారు.ఆనాడు చైనాపై యుద్ధం ప్రకటించి గట్టిగా బుద్ధి చెప్పిన ఘనత ఇందిరమ్మదన్నారు. భారత ఆర్మీ కల్నల్ సంతోష్‌ను చైనా పొట్టన పెట్టుకుంటే మోదీ కనీసం చైనాకు బుద్ధి చెప్పే ప్రయత్నం కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరమ్మ స్ఫూర్తితో పాక్‌ను రెండు ముక్కలు చేయాలని.. తాము మద్దతుగా ఉంటామని చెప్పారు. పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని రేవంత్ కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలుపుకొనేందుకు పాక్‌పై యుద్ధం చేయాలని, రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని చెప్పామన్నారు. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ ఏనాడూ రాజీ పడలేదని వివరించారు.

అమెరికాకు తలొగ్గి యుద్ధం విరమించిన బీజేపీ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం విడ్డురంగా ఉందని అన్నారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని బీజేపీ దెబ్బతీస్తే.. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కాంగ్రెస్ జైహింద్ యాత్ర చేపట్టిందని చెప్పారు. రాహుల్ గాంధీని దేశానికి ప్రధానిగా చూసే వరకు మనం విశ్రమించొద్దని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంతకు ముందు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సాయుధ దళాల విభాగం చైర్మెన్ రోహిత్ చౌదరి ప్రసంగించారు. కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ విజయశాంతి, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మధుయాష్కి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నేతలు, ఎన్ఎస్‌యూఐ నేతలు పాల్గొన్నారు.

## ప్రభాకర్ రావుకు బెయిల్

- మూడు రోజుల్లో భారత్‌కు వచ్చి విచారణకు హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశం
- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని సూచన ప్రభాకర్ రావుకు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఆయనకు తాత్కాలికంగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా ప్రభాకర్ రావు భారతదేశానికి తిరిగి రావాలని, ఇక్కడికి వచ్చిన తర్వాత దర్యాప్తునకు సంపూర్ణంగా సహకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ప్రభాకర్ రావు భారత్ తిరిగి వచ్చేందుకు వీలుగా ఆయన పాస్‌పోర్ట్‌ను కూడా మంజూరు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఆయనపై ఎలాంటి కఠినమైన చర్యలు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల్లో ఇండియాకు రావాలని ప్రభాకర్ రావును ఆదేశించింది.

## పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తాం




- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రులు, అధికారుల సమీక్ష

వివరాలు 4వ పేజీలో

## బీజేపీలోకి బీఆర్ఎస్‌ను విలీనం చేసే కుట్ర..!

- నేను జైల్లో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదనను వ్యతిరేకించా
- నా లేఖను ఎవరో కుట్రపూరితంగా లీక్ చేశారు
- కోవర్టులతోనే ఓడిపోయా
- కాంగ్రెస్‌తో సంప్రదింపులనే ప్రచారం అబద్ధం
- కేసీఆర్‌కు నోటీసులపై పార్టీ కార్యాచరణ ఎందుకు చేపట్టడం లేదు?
- అమెరికాలో పార్టీ రజతోత్సవాలు నిర్వహిస్తే ఏం లాభం?
- కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు
- మీడియా ప్రతినిధులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిట్‌చాట్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీజేపీకి బీఆర్ఎస్‌ను అప్పగించే ప్రయత్నం జరుగుతుందని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. తాను జైలులో ఉన్నప్పుడే.. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపొద్దని కేసీఆర్‌ను కోరానని ఆమె గుర్తు చేశారు. తొందరపాటు నిర్ణయం వద్దని జైల్లో ఉన్నప్పుడు కేసీఆర్‌కు సూచించానన్నారు. ఆరు నెలలు కాదు.. సంవత్సరాలు అయినా జైల్లో ఉంటానని కేసీఆర్‌కు తాను స్పష్టం చేశానని వివరించారు. అప్పటినుంచే నా తండ్రి కేసీఆర్ నుంచి నన్ను విడదీసే కుట్రలు, పార్టీకి, కుటుంబానికి దూరం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నన్ను పార్టీ నుంచి బయటకు పంపితే జరిగే లాభం ఎవరికి?' అన్నారు. హైదరాబాద్ లో గురువారం ఆమె మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

'కాంగ్రెస్ మునిగి పోయే పడవ. ఆ పార్టీలో నేనెందుకు చేరతా?. చేరితే ఏంటి లాభం? నేను కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. నేను కేసీఆర్‌కు రాసిన లేఖను కుట్రపూరితంగా లీక్ చేశారు. 2013 తర్వాత నేను కాంగ్రెస్ నేతలు ఎవరితోనూ మాట్లాడలేదు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు నష్టమే. అని అన్నారు.

"కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే కూడా నాయకులెవరూ స్పందించకపోతే ఎలా?" అని ఆమె ప్రశ్నించారు. పార్టీలో కొందరు కోవర్టులు ఉన్నారని, వారు తనకు నీతులు చెబుతున్నారని ఆరోపించారు. "నా మీద పడి ఏడిస్తే ఎలా?" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు. తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారని, దాన్ని అరికట్టమని కోరితే, పెయిడ్ సోషల్ మీడియా ద్వారా తనపైనే విమర్శలు చేయిస్తున్నారని కవిత మండిపడ్డారు. "ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా?" అని ఆమె నిలదీశారు. దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అని ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా? అని ప్రశ్నించారు. పెయిడ్ ఆర్టిస్ట్‌లతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ నేతలకు చెందిన మిగితా 4వ పేజీలో

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో జిల్లా ఫస్ట్




**- కలెక్టర్ ను అభినందించిన మంత్రులు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా అధికారులను మంత్రులు అభినందించారు. జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7808 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్దిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలో ఫేజ్-1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్-1లో 42 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఫేజ్- 2లో 763 మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. ఫేజ్ 1 కింద జిల్లాలో మొత్తం 439 ఇండ్లు మంజూరు చేయగా, 135 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలోని 11 మండలాల్లో మొదలు పెట్టిన మోడల్ హౌస్ లలో బేస్మెంట్ లెవెల్ లో మూడు, రూఫ్ లెవెల్లో రెండు, స్లాబ్ లెవెల్ లో ఆరు ఇండ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో గురువారం నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను, జిల్లా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

# వర్షాకాల వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి..

**● జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజితమీడియాతో మాట్లాడారు. సాధారణ జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఇంట్లో విడిగా ఉండాలని, కరోనా వ్యాప్తి నివారణకు ప్రభుత్వ వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. ప్రయాణాల్లో లేదా జనసమూహంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కోవిడ్ ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చిన వారు లక్షణాలు కనిపిస్తే వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షల కోసం వైద్యులను సంప్రదించాలని డాక్టర్ రజిత తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు, వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదని, చికిత్సతో పూర్తిగా నయమవుతుందని ఆమె స్పష్టం చేశారు.

# విషజ్వరాలపై చర్యలు తీసుకోవాలి..

**అవసరమైన డాక్టర్ లను అందుబాటులో ఉంచాలి..**

**రోగులను పిడిస్తున్న ప్రయివేట్ ఆసుపత్రిలపై నిఘా పెంచాలని డీవైఎఫ్ఐ డిమాండ్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గాంతుల మహేష్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారిని కోరారు. గాంతుల మహేష్ మాట్లాడుతూ, ఇటీవలి భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వ్యాధులు విస్తరిస్తున్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో కుటుంబాలు మంచాన పడుతున్నాయని, ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య లోపాల వల్ల పరిస్థితి మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 రోజులుగా పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, అధికారికంగా నమోదైన కేసుల కంటే వాస్తవంగా ఎక్కువ కేసులు ఉన్నాయని, అక్కడక్కడ మరణాలు సంభవిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, బెడ్లు, డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య పరికరాలు అందుబాటులో లేవని ఆయన ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయని, ప్లేట్‌లెట్స్‌ను నిర్ణయించే పరికరాలు కూడా అనేక చోట్ల లేవని తెలిపారు. దీంతో పేద, మధ్య తరగతి రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, అక్కడ అవసరం లేని పరీక్షలు, బెడ్ ఛార్జీలు, ఇతర ఛార్జీలతో రోగులను దోపిడీ చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



# అసలైన పేదలకు సంక్షేమ ఫలాలు అందడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్**

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరు సొంతింటిని కలిగి ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్,ఏఎంసి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతి అధికారుల తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం అందిస్తోందని, నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామన్నారు.లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పనులను వేగవంతం చేసి ఇందిరమ్మ ఇంటి కలను సాకారం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీఓ మీర్జా అహ్మద్ అలీ బెగ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సత్తు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సమీర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క శేఖర్, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు సుద్దాల శ్రీనివాస్, కరుణాకర్, పొన్నం లక్ష్మణ్ గౌడ్, మహేందర్, ఇందిరమ్మ కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల జాతర ను విజయవంతం చేద్దాం



**జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సభ కు పెద్ద సంఖ్యలో తరలిరావాలి..**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (హెచ్143) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా**

**ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (హెచ్143) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, లాయక్ పాషా, టీజేఎఫ్ 2001 మే 31న "తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు" నినాదంతో ఆవిర్భవించి, 2014లో తెలంగాణ రాష్ట్ర సాధన వరకు అన్ని వర్గాల ప్రజలను, ఉద్యమ సంఘాలను సంఘటితం చేసిన ఘనతను గుర్తు చేశారు. ఈ చారిత్రాత్మక నేపథ్యంలో, మే 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి ఆయాచితుల జితేందర్, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, జిల్లా రమేష్, దేవరాజ్, ప్రచార కార్యదర్శి షేక్ రియాజ్, కోడం గంగాధర్, హరీష్, విష్ణు, రాజేందర్, వెంకటేష్, ఇమ్రాన్, ఫహద్ పాషా, సల్మాన్, శ్యామ్, షోయబ్ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగించుకోవాలి

**ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ గాజర్ల రమేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, పాఠశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఎస్సీఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల వేసవి శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కొత్త మెలకువలు నేర్చుకొని, పాఠశాలల్లో సమర్థవంతంగా బోధనను నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను సమర్థవంతంగా ఉపయోగించడం అందరూ ఉపాధ్యాయులు నేర్చుకోవాలని, వివిధ రకాల ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) టూల్స్‌ను నేర్చుకొని పిల్లలకు నేర్పించాలని దిశానిర్దేశం చేశారు. వెంకంపేట పాఠశాలలో జరుగుతున్న రెండవ దశ జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సెంటర్ ఇన్‌ఛార్జి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని రమేష్ ప్రశంసించారు. రిసోర్స్ పర్సన్‌లు రాష్ట్రస్థాయిలో నేర్చుకున్న మెలకువలను జిల్లాలోని అందరు ఉపాధ్యాయులకు నేర్పాలని సూచించారు. అనంతరం, రెండో దశ శిక్షణా కార్యక్రమంలో ఉత్తమ పార్టిసిపెంట్‌లుగా నిలిచిన పావని, రవీందర్, శ్రీలత, మనోహర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, రిసోర్స్ పర్సన్‌లు వంగల తిరుపతిరెడ్డి, ఎన్. భాస్కర్, దూస సంతోష్, యాద రవి మరియు వివిధ మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# త్వరలో యూకేలోనూ బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాలు : కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సంబరాలలో భాగంగా యునైటెడ్ కింగ్డమ్‌లోను పార్టీ రజతోత్సవ సంబరాలను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడి పార్టీ ఎన్.ఆర్.ఐ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్.ఆర్.ఐ విభాగం నుంచి వచ్చిన ఓ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. పార్టీ రజతోత్సవ వేడుకలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించాలన్న పార్టీ అధినేత కేసీఆర్ సూచన మేరకు ఇంగ్లాండ్ లో కూడా నిర్వహించాలని ఎన్.ఆర్.ఐ నేతలు కేటీఆర్ ను కోరారు. ప్రాంతాలకు అతీతంగా యూకేలో ఉన్న తెలుగు వాళ్లంతా ఈ సంబరాల్లో పాల్గొనడానికి ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. దీంతో పార్టీ రజతోత్సవ సంబరాలను యూకే లో నిర్వహించడానికి కేటీఆర్ నిర్ణయించారు. ఇప్పటికే తెలంగాణలో వరంగల్ బహిరంగ సభ ద్వారా రజతోత్సవ సంబరాలను ప్రారంభించినట్లు తెలిపిన కేటీఆర్. ఏడాది కాలం పాటు వివిధ రూపాలలో, దేశ విదేశాలలో ఈ సంబరాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అమెరికాలోని డల్లాస్ నగరంలో జూన్ 1వ తేదీన సిల్వర్ జూబ్లీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపిన కేటీఆర్, ఇదే క్రమంలో యూకే లోను సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంబరాలకు స్వయంగా తాను హాజరు కావడంతో పాటు, పార్టీ సీనియర్ నేతలు, తెలంగాణ కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నట్లు కేటీఆర్ తెలిపారు.

# సంక్షేమ పథకాలు అనర్హులకు అందిస్తే అధికారులపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించి సాగునీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే ప్రతిపాదన రూపొందించాలని వాటికి సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేస్తామని అన్నారు. కరీంనగర్ జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని ఇందుకు మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సాకారంతో ముందుకు వెళ్తానని అన్నారు.

28 మే నాటికి యాసంగి పంట కొనుగోలు కోసం రైతులకు రాష్ట్రంలో దాదాపు 13 వేల కోట్లు చెల్లించామని, గత ప్రభుత్వ హయాంలో ఇదే సమయం 2023 సంవత్సరానికి 3 వేల 500 కోట్లు మాత్రమే చెల్లించారని అన్నారు. సింగరేణి భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బండ్ల వాగు ఎత్తిపోతల పథకాన్ని వారం రోజులలో ప్రారంభిస్తామని, పాలకుర్తి ఎత్తిపోతల పథకం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. నీరు అందుబాటులో ఉండి, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు.

ప్రాజెక్టులలో ఉన్న నీళ్ల సమర్ధవంతంగా వినియోగించడం వల్ల పెద్ద ఎత్తున పంటలు పండాయన్నారు. సాగునీటిని పొదుపు క్రమంగా వాడటం వల్లే పెద్ద ఎత్తున పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. యాసంగి పంట సన్న రకాల వడ్లను బాయిల్డ్ రైస్ గా మార్చేందుకు ప్రభుత్వం రైస్ మిల్లులో ప్రతిపాదనలు ఆమోదిస్తుందని అన్నారు. ఈ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోను చర్చిస్తామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి శాఖను సమగ్రంగా ప్రక్షాళన చేశామని అన్నారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు అటవీ అనుమతులు వచ్చేలా జగిత్యాల జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అందుకోసం అవసరమైన ఉన్నతాధికారులతో నిత్యం సంప్రదింపులు జరపాలని అన్నారు . ఆయా జిల్లాల కలెక్టర్లు రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తమ ప్రభుత్వం కొనుగోలు చేసి తీరుతుందని పేర్కొన్నారు.

నారాయణపురం రిజర్వాయర్, కొండగట్టు ఎత్తిపోతల పథకం,, కలికోట సూరమ్మ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రాజకీయాలు ఉండవని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో ప్రతిపక్ష ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని. రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామనిఅన్నారు.

భారతదేశంలో మొదటి సారిగా రాష్ట్రంలోనే 84% జనాభాకు ఉచితంగా ఆరు కిలోల సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే విప్లవాత్మకమైన పథకమని సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్టు అంశంలో జ్యుడిషియల్ కమిషన్ కు నాయకులు సహకరించాలని, జ్యుడిషియల్ కమిషన్ నివేదిక ప్రకారం తప్పనిసరిగా చర్యలు ఉంటాయని అన్నారు. మీడియా మిత్రులకు ఎస్సారెస్పీ దగ్గర అందుబాటులో ఉన్న భూములు పంపిణీకి ఉన్న సమస్యలు పరిష్కరించి త్వరలోనే ఇంటి పట్టాలు కేటాయిస్తామని అన్నారు. కరీంనగర్ మీడియా మిత్రులు ఇండ్ల పట్టాల పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ తో చర్చించి త్వరలోనే పట్టాలు అందించే కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు.

ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగిందని అన్నారు. ఎన్.డి.ఎస్.ఏ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తామని అన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం క్రింద 51 కోట్లు విడుదల చేశామని అన్నారు. భూ భారతి చట్టంతో పట్టాదారులకు ఎటువంటి నష్టం రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు సర్వే నెంబర్, యాజమాన్యం, విస్తరణ, బౌండరి వివరాలు ఉండేలా అందిస్తామని అన్నారు.అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలని, పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరగాలని అన్నారు.ఆయా జిల్లాలో కలెక్టర్లు సమన్వయంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల ఎంపికలో నిబంధనలు పాటించాలని అర్హులైన పేదలకు మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని పేర్కొన్నారు. అనర్హులకు అందిస్తే మాత్రం అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు.

రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రైస్ మిల్లుల వద్ద తూకం పేరుతో రైతులు అనేక ఇబ్బందులు గురయ్యారని , ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ ఇబ్బంది రాలేదని అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోకి భూపాలపల్లి హనుమకొండ సిద్దిపేట జిల్లాలు వస్తాయని ఆయా జిల్లా కలెక్టర్లను సైతం ఉమ్మడి జిల్లా వారి సమీక్ష సమావేశాలకు అధికారులు ఆహ్వానించాలని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ఎక్కడ అవినీతికి ఆస్కారం లేదని అన్నారు. మన ప్రభుత్వం నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. . ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైస్ మిల్లుల దగ్గర ఎక్కడైనా ధాన్యం కోత విధిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో పెండింగ్ ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు భవిష్యత్తు లో మంజూరు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా ప్రజల్లో మంచి పేరు వచ్చిందని అన్నారు.

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించిందని త్వరలో పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. తెలంగాణలోని ప్రసిద్ధిగాంచిన వేములవాడ ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని,శృంగేరి పీఠం.. ఆగమ శాస్త్రం ప్రకారం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామనిఅన్నారు. ఈ సమావేశంలో

ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,చింతకుంట విజయ రమణా రావు,ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,డాక్టర్ మేడిపల్లి సత్యం,ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య చిన్నమైలు అంజిరెడ్డి

కలెక్టర్లు పమేలా సత్పతి,సత్య ప్రసాద్,సందీప్ కుమార్ ఝ,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝ, సత్య ప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ జే.అరుణ వివిధ శాఖల ఉన్నతాధికారులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయం లోపల దేవత విగ్రహాలను ముట్టుకుంటే ఊరుకునేది లేదు..




**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న ఆలయం అభివృద్ధి లో భాగంగా దేవాలయం లోపలి ఎలాంటి దేవత విగ్రహాలను ముట్టుకున్న ఊరుకునేది లేదనిరాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని బీమేశ్వర గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి గురించి చర్చిస్తామని రాజన్న పరిరక్షణ సమితితో మాట్లాడడం, మరోవైపు దేవస్థానం ఈవో ద్వారా కెవిట్ నోటీస్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దేవాలయ అభివృద్ధిని అడ్డుకుంటున్నామని అనడం అవివేకం అని,దేవాలయం అభివృద్ధికి వ్యతిరేకం కాదని అన్నారు.ఇప్పటివరకు ఎలాంటి ప్లాన్ లేకుండానే ఆలయాన్ని మూసివేస్తామని అనడం సమంజసం కాదని,అభివృద్ధిని అడ్డుకుంటామని ముందుగానే కోర్టు ద్వారా కెవిట్ నోటీసు ఎలా ఇస్తారని అన్నారు.దేవాలయ అభివృద్ధి ఏ డిపార్ట్మెంట్ చేస్తుందో వెల్లడించాలని, ఫైనల్ ప్లాన్ ను ప్రజలకు తెలియజేయాలని అన్నారు.దేవాలయంలో జరిగిన అన్ని ధర్మశాలలకు ఏలాంటి పర్మిషన్ లేదని,అన్ని నిర్మాణాలపై కోర్టుకు వెళ్తామని అన్నారు.

## కోనరావుపేట మండలంలో జూన్ 3 నుంచి 16 వరకు రెవెన్యూ సదస్సులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కోనరావుపేట మండలంలో జూన్ 3 నుంచి 16వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తాసిల్దార్ వరలక్ష్మి తెలిపారు. ఈ సదస్సులు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో తేదీలవారీగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. సదస్సులకు తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది వచ్చి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు.



Statement Showing the Schedule of Bhubharathi Revenue Sadassulu in Konaraopet Mandal of Rajanna Sircilla District

| Sl. No | Schedule Date | Name of the Revenue Village | Team No | Name of the Officer with Designation | Supporting Staff with Desiganation | Revenue Sadassulu conducted Venue | Time |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 1 | 03.05.2025 | Kolanoor | Team-I | B.Varalaxmi, Tahsildar No.7337404446 | Ch. Santhosh Kumar, Girdawar, L.Sruthi, Dy.Surveyor M. Sujatha Jr.Asst, K.Anjaneyulu Jr.Asst M.Devendar, Rec. Asst M.Bikshapathi D.Manoj Kumar Meeseva Operator | Gramapanchayath Office | 10.30 to 4.00 PM |
| 2 | 04.06.2025 | Marthanpet | | | | | 10.30 to 4.00 PM |
| 3 | 05.06.2025 | Dharmaram | | | | | 10.30 to 4.00 PM |
| 4 | 06.05.2025 | Malkpet | | | | | 10.30 to 4.00 PM |
| 5 | 09.06.2025 | Konaraopet | | | | | 10.30 to 4.00 PM |
| 6 | 10.06.2025 | Ramannapet | | | | | 10.30 to 4.00 PM |
| 7 | 11.06.2025 | Nagaram | | | | | 10.30 to 4.00 PM |
| 8 | 12.06.2025 | Shivangalapalli | | | | | 10.30 to 4.00 PM |
| 9 | 13.06.2025 | Venkatraopet | | | | | 10.30 to 4.00 PM |
| 10 | 16.06.2025 | Konadapoor | | | | | 10.30 to 4.00 PM |
| 11 | 03.05.2025 | Bhavusaipet | Team-II | A. Praveen Kumar Deputy Tahsildar No.9490220444 | K.Praveen Kumar, Girdawar L.Sruthi, Dy.Surveyor A.Sravanthi Jr.Asst Md.Nazeer Jr.Asst L. Mahesh Rec.Asst Harikrishna Dharani Operator | Gramapanchayath Office | 10.30 to 4.00 PM |
| 12 | 04.06.2025 | Vattimalla | | | | | 10.30 to 4.00 PM |
| 13 | 05.06.2025 | Kanagarthi | | | | | 10.30 to 4.00 PM |
| 14 | 06.05.2025 | Nizamabad | | | | | 10.30 to 4.00 PM |
| 15 | 09.06.2025 | Mamidipally | | | | | 10.30 to 4.00 PM |
| 16 | 10.06.2025 | Marrimadla | | | | | 10.30 to 4.00 PM |
| 17 | 11.06.2025 | Nimmapalli | | | | | 10.30 to 4.00 PM |
| 18 | 12.06.2025 | Suddala | | | | | 10.30 to 4.00 PM |
| 19 | 13.06.2025 | Pallimaktha | | | | | 10.30 to 4.00 PM |

29/5/2025
Tahsildar, Konaraopet

## ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..

**-ఉపాధ్యాయుల, విద్యా రంగ సంక్షేమానికి టీపీటీఎఫ్ నిరంతర కృషి**

**-టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి**




**బలగం టీవీ, సిరిసిల్ల**

టీపీటీఎఫ్ ఉపాధ్యాయ, విద్యా రంగ సంక్షేమానికి కట్టుబడి ఉందని దాని కొరకు నిరంతరం పోరాటం చేస్తుందని,సామాజిక, ఆర్థిక,రాజకీయ దృక్కోణంలో సమస్యలను విశ్లేషించి పరిష్కారం కొరకు నిరంతరం కృషి చేస్తుందని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి అన్నారు.తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణం లోని జడ్పీ హెచ్ ఎస్ గీతానగర్ ఉన్నత పాఠశాల లో పతాకావిష్కరణ నిర్వహించినారు.అనంతరం టిపిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్ రెడ్డి మాట్లాడుతూ

ప్రభుత్వ విద్యను, పాఠశాలలను కాపాడుకోవడానికి ఫెడరేషన్ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు... ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడు విద్యా విధానాలు మారడం నూతనంగా పాఠశాలలను ఏర్పాటు చేయడం తద్వారా ఉన్నటువంటి ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలలు సంక్షోభంలోకి నెట్టివేయబడ్డాయని అన్నారు.ప్రస్తుత పరిస్థితులలో విద్యారంగం సంక్షోభంలో ఉంది ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ తదనంతరం విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని విద్యా ప్రమాణాల పెంపుదలకు ఫెడరేషన్ ఉపాధ్యాయులు కృషి చేయాలని,నిత్య జీవితానికి తరగతి గదినీ జోడించి ప్రయోగాత్మకంగా విద్యను అందించాలని పిలుపునిచ్చారు.

2008 డి ఎస్ సి ఉపాధ్యాయులకు జీతం 4 నెలలైనా ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని,సమగ్ర సర్వే చేసిన ఉపాధ్యాయులక గౌరవ వేతనం ఇంతవరకు రాలేదని వారికి వేతనం ఇవ్వాలని, అదేవిధంగా సెలవులలో సర్వే చేసిన కాలానికి సరిపడ సీసీఎల్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య మాట్లాడుతూ టీపీటీఫ్ గత 40 సంవత్సరాలుగా విద్యారంగలో సామాజికంగా ఉన్నటువంటి రుగ్మతలను రూపుమాపడానికి నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగుల ఆర్థిక బిల్లులు చెల్లించాలని,

మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెండింగ్ లో ఉన్న 5 విడతల కరువు భత్యాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సత్తు రవీందర్,జిల్లా ఉపాధ్యక్షులు పురం వాసుదేవరావు, మందాడి శ్రీనివాస్ రెడ్డి , నూగురి దేవేందర్ , కెవి రజినీరాణి , జిల్లా కార్యదర్శిలు తాళ్లపల్లి శ్రీధర్ మైలారం తిరుపతి చకినాల రామచంద్రం, ఎల్లారెడ్డిపేట అధ్యక్షుడు కదిరె శ్రీనివాస్ వేములవాడ అధ్యక్షులు బొజ్జ కృష్ణ,తంగళ్ళపల్లి అధ్యక్షుడు బండి ఉపేందర్,కోనరావుపేట అధ్యక్షులు కుమార్,ఇల్లంతకుంట ప్రధాన కార్యదర్శి లౌడ్య శ్రీనివాస్,వీర్నపల్లి అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ సిరిసిల్ల ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావు, తంగళ్ళపల్లి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ వీరినపల్లి ప్రధాన కార్యదర్శి సుల్తాన్ శ్రీనివాస్ ఎల్లారెడ్డిపేట ప్రధాన కార్యదర్శి సతీష్ జిల్లా బాధ్యులు రాంప్రసాద్,భూమేష్,రమేష్,రవిబాబులు పాల్గొన్నారు

## ప్రోటోకాల్‌పై కాంగ్రెస్ నేతల అజ్ఞానం : బీఆర్ఎస్ నేతలు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రోటోకాల్‌పై ఏమీ తెలియని అజ్ఞానులు కాంగ్రెస్ నేతలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ తీవ్రంగా విమర్శించారు. గురువారం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యపై చేసిన విమర్శలకు కౌంటర్‌గా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తోట ఆగయ్య ప్రజల ఓట్లతో నాలుగుసార్లు ప్రజాప్రతినిధిగా గెలిచిన విషయాన్ని మరిచి మాట్లాడటం సిగ్గుచేటని సందీప్ అన్నారు. ఇక ప్రోటోకాల్ గురించి కాంగ్రెస్ నాయకులు అజ్ఞానంతో మాట్లాడుతున్నారని, ప్రోటోకాల్ అనేది ఎవరికి ఉంటుందో అధికారులను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నేత సీత్యానాయక్ మాట్లాడుతూ, తోట ఆగయ్య పలుసార్లు ప్రజాప్రతినిధిగా ఎంపికవ్వడమే కాకుండా, నలుగురు ఎమ్మెల్యేలకు సమానమైన పార్టీ జిల్లా అధ్యక్ష స్థానంలో ఉన్నాడనే సోయి లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అంతటి స్థాయి ఉన్న నాయకుడిపై అతీగతీలేని ఒక చిన్న డైరెక్టర్ మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. విమర్శలు చేసేవారి స్థాయి ఏంటో ప్రజలకు తెలుసని, మరోసారి అవే విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ఫైనల్‌కు ఆర్‌సీబీ..

- పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయం
- విజృంభించిన ఆర్సీబీ బౌలర్లు
- 101 పరుగులకే ఆలౌటైన పంజాబ్



**బలగం టీవీ, హైదరాబాద్**

సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఐపీఎల‌ ఫైనల్‌కు దూసుకెళ్లింది. పంజాబ్ కింగ్స్‌తో గురువారం ముల్లాన్‌పూర్ వేదికగా సాగిన క్వాలిఫయర్-1లో సమష్టిగా రాణించిన ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా పంజాబ్ కింగ్స్‌ను తక్కువ స్కోర్‌కు కట్టడి చేసిఅనంతరం ఫిల్ సాల్ట్ విధ్వంసంతో సునాయస విజయాన్నందుకుంది. 9 ఏళ్ల తర్వాతా ఫైనల్ చేరిన ఆర్‌సీబీ.. 18 ఏళ్ల తమ కలను సాకారం చేసుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది. మరోవైపు పంజాబ్ కింగ్స్‌కు క్వాలిఫయర్-2 రూపంలో మారో అవకాశం ఉంది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ పంజాబ్ కింగ్స్ 14.1 ఓవర్లలో 101 పరుగులకు కుప్పకూలింది. పంజాబ్ బ్యాటర్లలో మార్కస్ స్టోయినీస్(17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 26) మినహా అంతా విఫలమయ్యారు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య(7), ప్రభ్ సిమ్రాన్ సింగ్(18)తో పాటు జోష్ ఇంగ్లీస్(4), శ్రేయస్ అయ్యర్(2), నెహాల్ వధేరా(8) తీవ్రంగా నిరాశపరిచారు. ఆర్‌సీబీ బౌలర్లలో జోష్ హజెల్ వుడ్(3/21), సుయాశ్ శర్మ(3/17) మూడేసి వికెట్లు తీయగా.. యశ్ దయాల్(2/26) రెండు వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్, రొమారియో షెపర్డ్‌కు చెరో వికెట్ దక్కింది.

అనంతరం ఆర్‌సీబీ 10 ఓవర్లలోనే 2 వికెట్లకు 106 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఫిల్ సాల్ట్(27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 56 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించగా.. రజత్ పటీదార్(8 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 15 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. పంజాబ్ బౌలర్లలో కైల్ జెమీసన్, ముషీర్ ఖాన్ చెరో వికెట్ తీసారు. ఆర్‌సీబీ ఫైనల్ చేరడం ఇది నాలుగో సారి. గతంలో 2009, 2011, 2016లో ఫైనల్ చేరిన ఆర్‌సీబీ తృటిలో టైటిల్ చేజార్చుకుంది.

## 'పరమ్ సుందరి' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'పరమ్ సుందరి' ఫస్ట్ లుక్ టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని తుషార్ జలోటా ('దాస్వి' ఫేమ్) దర్శకత్వం వహించారు. ఈ చిత్రం నార్త్ ఇండియాకు చెందిన 'పరం' (సిద్ధార్థ్ మల్హోత్రా), సౌత్ ఇండియాకు చెందిన 'సుందరి' (జాన్వీ కపూర్) మధ్య ప్రేమకథగా సాగనుంది.

# పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తాం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులుఈ ఏడాది ధాన్యం పండించారని, 65 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతాంగం పండించారని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా లో డిప్యూటీ సీఎంతోపాటు ఇన్చార్జ్ మంత్రులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలబడిందని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతాంగానికి వారం రోజుల్లలో వారి ఎకౌంట్లలో డబ్బులు వేస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయమని, రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని భట్టి విక్రమార్క అన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒకేసారి 3,500 కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిరంతరం ఇళ్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలతో ఆడుకున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో నాలుగు లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేసి పేదలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. చిన్న పొరపాటు కూడా జరగడానికి వీల్లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇదోక మహోత్తర కార్యక్రమం అని, ఇంత గొప్ప కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. రాష్ట్రంలో రైతన్నకు విత్తనాలు అందజేసే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, నకిలీ విత్తనాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి, ప్రజలకు హామీ ఇచ్చామని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిని రద్దు చేస్తామని స్పష్టంగా చెప్పామన్నారు. చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేసి ఆనాదిగా వస్తున్న దుర్మార్గపు చట్టాలను తొలగించి సరికొత్త భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని చెప్పారు. పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఇన్చార్జి మంత్రులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై అధికారులతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సీజనల్ వ్యాధుల దగ్గర నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు ప్రతి ఒక్క అంశంపై చర్చ జరుపుతున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నామని, అధికారులకు స్పష్టమైన ఆదేశాలిస్తున్నామన్నారు. రైతాంగానికి ప్రజలకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది కలగడానికి వీల్లేదని.. ఇది ప్రజా ప్రభుత్వమని, పేదల ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ముందు ఉందని అన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు వర్చ్యువల్ మంత్రులున్నారని, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించబోతున్నామని మంత్రి కోమటి రెడ్డి వెంట రెడ్డి తెలిపారు. ప్రభుత్వాసుపత్రులలో వైద్య సేవలు మెరుగుపరిచి పేదలకు మంచి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని చెప్పారు. కార్పొరేటర్ స్థాయిలో పేదలకు వైద్యం అందించాలనే సంకల్పంతో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగిందని, మాత శిశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

# ఉత్తమ చిత్రంగా కల్కి









(మొదటి పేజీ తరువాయి)

ఏయే కేటగిరిలో గద్దర్ అవార్డులు వచ్చాయంటే...

2024 అవార్డులు

మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898ఏడీ

రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్

మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్

ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు

హిస్టరీ – హెరిటేజ్ చిత్రం: రజాకార్

ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్

ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్ళు)

ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)

ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)

ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)

ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)

ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్– లేదే లేదే ప్రేమసలే)

ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)

ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (నిజమే నే చెబుతున్నా – ఊరి పేరు భైరవకోన)

ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (సూసేకి అగ్గిరవ్వ – పుష్ప 2)

ఉత్తమ హాస్యనటులు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2)

ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)

ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)

ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)

ఉత్తమ సినిమాటోగ్రఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)

ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)

ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)

ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (ఆయుధ పూజ – దేవర)

ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: అద్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)

ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)

ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)

ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి 2898 ఏడీ)

**స్పెషల్ జ్యూరీ అవార్డులు..**

నటుడు: దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)

నటి: అనన్య నాగళ్ల (పొట్టేల్)

దర్శకులు: సుజీత్, సందీప్ (క)

నిర్మాతలు: ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి (రాజు యాదవ్)

స్పెషల్ జ్యూరీ స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2)

తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: 'మన సినిమా ఫస్ట్ రీల్' (రెంటాల జయదేవ్)

# బీజేపీలోకి బీఆర్ఎస్‌ను విలీనం చేసే కుట్ర..!

(మొదటి పేజీ తరువాయి)

హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తను రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు. సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మా వాళ్ళు కొందరు.. సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటున్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించుకుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీ సీఎంగా ఉండగా చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఏమి చేసినా.. కేంద్రం అడ్డుకోవటం లేదని ఒకింత అసహనాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇప్పటికీ గోదావరి నదీ జలాలు పంపకం సరిగా జరగలేదన్నారు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ నోటీసులు ఇస్తే.. పార్టీ ఎందుకు కార్యాచరణ తీసుకులేదని పార్టీలోని అగ్రనేతలను ఆమె సూటిగా ప్రశ్నించారు.

పెద్ద నేతలుగా ఊహించుకునే వారు ఎందుకు స్పందించ లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో తాను చేరటానికి ప్రయత్నం చేశాననటం అబద్ధమన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని ఈ సందర్భంగా కవిత అభివర్ణించారు. తన పార్టీ బీఆర్ఎస్.. తన నాయకుడు కేసీఆర్ అంటూ కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే తన నాయకుడని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తప్ప.. ఇతర నేతల నాయకత్వంలో తాను పనిచేయనని కుండ బద్దలు కొట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న వారిని గౌరవిస్తానని కవిత పేర్కొన్నారు.